సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



అధికారం అండతో.. బరితెగింపు

రెడ్‌బుక్ రాజ్యాంగం అండతో టీడీపీ గూండాలు దాడులకు తెగబడుతున్నారు. అధికారంలో ఉన్నది తామేనన్న అహంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. -8లో



కనుల పండువగా త్రేతేశ్వరుని కల్యాణం

అత్తిరాలలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజు గురువారం శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 70 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

రాయచోటి: జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును మూడు నెలలు పొడిగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ నుంచి జిల్లాకు సమాచారం అందిందన్నారు. ఈ నిర్ణయం మేరకు అక్రిడిటేషన్ కార్డుల వ్యాలిడిటీని మార్చి 1 నుంచి 31వ తేదీ వరకు లేదా కొత్తకార్డులు జారీ చేయడం, ఏది ముందు జరిగితే అప్పటి వరకు కార్డుల వ్యాలిడిటీని పొడిగించినట్లు పేర్కొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్‌డేను విజయవంతం చేయండి

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి పట్టణం డైట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 28వ తేదీన జిల్లా స్థాయి జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ''వికసిత్ భారత్ కోసం సైన్స్.. ఆవిష్కరణలలో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత''అనే అంశంపై క్విజ్, సెమినార్ నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఎలిమెంటరీ స్థాయి(1–8 తరగతులు) విద్యార్థులకు, సెకండరీ (9–10 తరగతులు) విద్యార్థులకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. అలాగే అన్ని పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని వేడుకలాగా నిర్వహించాలని ఆయన ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

పులివాహనంపై వీరభద్రుడి విహారం



పులివాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

రాయచోటి టౌన్: రాయచోటి వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం స్వామి వారు పులివాహనంపై ఊరేగారు. అర్చకులు ఉదయం స్వామి, అమ్మవారికి అభిషేకాలు జరిపారు.అనంతరం రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి ప్రత్యేకంగా పులివాహనంపై కొలువుదీర్చారు. రాయచోటి పురవీధుల్లో ఊరేగించారు. మార్కెట్ వీధి, గాంధీబజార్, కంసలవీధి, బ్రాహ్మణ వీధుల గుండా ఊరేగింపు కొనసాగింది. భక్తులు స్వామి, అమ్మవార్లకు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

రావణ వాహనంపై..

రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడు రావణ వాహనంపై ఊరేగారు. శ్రీ వీరభద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రావణ వాహనంపై కొలువుదీర్చి ఆలయ మాఢవీధులలో, పురవీధులలో ఊరేగించారు.

మహా సంప్రోక్షణకు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న సీఈ సత్యనారాయణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో జీర్ణోద్ధరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.దీంతో మహా సంప్రోక్షణకు అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని తిరుమల–తిరుపతి దేవస్థానం సివిల్ విభాగం చీఫ్ ఇంజనీర్ టీవీ సత్యనారాయణ గురువారం సంబంధిత అధికారులు, గుత్తేదారులకు సూచించారు. మహా సంప్రోక్షణకు విచ్చేసే భక్తుల కోసం అన్ని వసతులు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఎండ నుంచి ఉపశమనం కల్గించేందుకు చలువపందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అనంతరం శాశ్వత కల్యాణ వేదిక వద్ద బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు సూచనలు ఇచ్చారు. సివిల్ విభాగం ఎస్ఈ మనోహర్, ఈఈ సుమతి, డీఈ నాగరాజు, ఏఈ అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షోభంలో చేనేత



చేనేత కేంద్రాలు ఎక్కడ చూసినా మగ్గాల చప్పుళ్లు.. కార్మికుల సందడితో మారుమోగుతుండేవి. ఇదంతా గతం. ఏడాది నుంచి పరిస్థితి భిన్నంగా మారింది. విపరీతంగా పెరిగిన ముడిపట్టు (రేషం, వార్పు) ధరలు ఒక వైపు, నేసిన పట్టుచీరలకు మద్దతు ధర లేకపోవడం మరో వైపు.. ఆదుకోవాల్సిన ప్రభుత్వం పైసా సాయం అందించకుండా తాత్సారం చేయడం వంటి కారణాలతో చేనేత రంగ పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది.

- భారీగా పెరిగిన ముడిపట్టు ధరలు
- పట్టుచీరలకు మద్దతు ధర కరువు
- రోజు కూలి సైతం గిట్టుబాటు కాని వైనం



ఆగిన చేనేత మగ్గం

మదనపల్లె సిటీ: మొన్నటి వరకు ఒక వెలుగు వెలిగిన చేనేత పరిశ్రమ నేడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. కార్మికులకు రోజుకూలి రావడం కూడా గగనమైపోతోంది. దీంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారు. జిల్లాలో మదనపల్లె (నీరుగట్టువారిపల్లె),కలకడ, తంబళ్లపల్లె, నిమ్మనపల్లె, వాల్మీకిపురం, కురబలకోట, బి.కొత్తకోట,పుల్లంపేట, చిన్నమండ్యం, గాలివీడు, సంబేపల్లి, రాజంపేట, వీరబల్లి తదితర ప్రాంతాల్లో సుమారు 18 వేలకుపైగా చేనేత మగ్గాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికిపైగా కార్మికులు, అనుబంధ రంగాల వారు ఈ రంగంపై ఆధారపడి పని చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి వ్యయం

పట్టుచీరల తయారీకి ఉపయోగించే ముడిపట్టు (వార్పు, రేషం, జరీ) ధరలు ఏడాది కాలంలో 20 శాతానికిపైగా పెరిగాయి. గత ఏడాది కిలో రేషం 3,500, వార్పు కిలో రూ.3,800 ఉండగా ప్రస్తుతం కిలో రేషం రూ 4,200, కిలో వార్పు రూ.6 వేలకు పెరిగాయి. గతంలో మార్కు జరీ రూ.600 ఉండగా ప్రసుత్తం రూ.750కు చేరింది. ప్రతి చీరపై 20 శాతం అధికంగా పెట్టుబడి వ్యయం పెరిగిపోవడంతో చేనేత కార్మికులకు లాభాలు రాకపోగా కనీసం రోజు కూలి కూడా రావడం గగనంగా మారింది. ముడిపట్టు ధరలు భారీగా పెరగడం, గత ఏడాది పట్టుచీర ధర ఎంత ఉంటే ప్రస్తుతం కూడా అంతే ఉండటంతో చేనేతలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

నేతన్న నేస్తం ఉంటే పరిస్థితి మెరుగ్గా...

గత వైఎస్సార్ సీపీ పాలనలో ముడిపట్టు ధరలు పెరగడం, తగ్గడం సహజంగా ఉండేది. ఈ ఒడిదుడుకులను తట్టుకునేందుకు అప్పటి సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకాన్ని 2019 డిసెంబర్‌లో ప్రారంభించారు. ఈ పథకం కింద ఒక్కో చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు ముడి పట్టురాయితీని ఒకేసారి బ్యాంకు ఖాతాలో జమ చేసి ఆదుకునే వారు. ఇలా ఐదేళ్ల పాటు సాయం అందించారు. కరోనా వంటి కష్టకాలంలో రెండు నెలలు ముందుగానే నేతన్న నేస్తం నిధులు కార్మికుల ఖాతాల్లో జమ చేశారు. ఫలితంగా చేనేతలు తమ మగ్గాలను ఆధునీకరించుకుని గతంలో కంటే మెరుగైన డిజైన్‌లను వేసుకుని ఎక్కువ లాభం సంపాదించి అభివృద్ధి చెందారు.

నాడు వైఎస్సార్‌సీపీ పాలనలో నేతన్న నేస్తం వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	నిధులు (రూ.లలో)
2021	5837	14,00,88,000
2022	6118	14,68,32,000
2023	6937	16,64,88,000

కూటమి సర్కార్ చిన్నచూపు

కూటమి సర్కార్ చేనేతలను చిన్నచూపు చూస్తోంది.వారిని ఆదుకున్న నేతన్న నేస్తం పథకానికి సైతం మంగళం పాడింది. దీంతో ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడం ..ముడిపట్టు ధరలు పెరుగుతుంటంతో పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోతున్నారు. దీంతో చాలా మంది కార్మికులు రేషం, వార్పు ధరలు తగ్గే వరకు మగ్గాలు నిర్వహించకుండా ఆపేస్తున్నారు.మరికొంత మంది రేయింబవళ్లు మగ్గం నేస్తూ తక్కువ కూలీతోనే బతుకు వెళ్లదీస్తున్నారు. ఇంతటి దయనీయమైన పరిస్థితులను చేనేతలు ఎప్పుడూ చూసినా దాఖలాలు లేవు.

- నేడు కూటమి పాలనలో ముడిపట్టు ధరలు పెరుగుదల: 20 శాతం
- పట్టుచీరల ధర: గతంలో ఎంతో .. ఇప్పుడు అంతే
- కూటమి సర్కారు నుంచి చేనేత కార్మికులకు పైసా సాయం అందలేదు

హామీలు అమలు చేయాలి



ఎన్నికల ముందు చేనేతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. నేతన్న నేస్తం వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా లబ్ధిపొంది నిలదొక్కుకున్నారు. నేతన్ననేస్తం అందకపోవడంతో చాలా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. ముడిపట్టు, వార్పు ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం చేనేతలను ఆదుకోవాలి. –శీలం రమేష్, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు

చేనేత మనుగడ కష్టమే



చేనేతరంగం మనుగడ కష్టంగా మారింది. మగ్గాల నిర్వహణ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ముడిపట్టు రాయితీ కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటి వరకు చేనేతలను పట్టించుకోకపోవడం బాధాకరం. – దండు రామాంజులు, చేనేత సంఘ నాయకులు

ఇబ్బందులు పడుతున్నాం



ఏడాది కాలంగా ముడిపట్టు ధరలు విపరీతంగా పెరగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోజంతా మగ్గం నేసినా కూలి కూడా రావడం లేదు. ప్రభుత్వం స్పందించి ముడిపట్టు రాయితీని అందిస్తే ఉపయోగం ఉంటుంది. –లక్ష్మి, చేనేత కార్మికురాలు

జిల్లాలో తొలిసారి చట్టపరంగా దత్తత

- చిన్నారిని అక్కున చేర్చుకున్న తమిళనాడుకు చెందిన దంపతులు
- అభినందించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్



తమిళనాడుకు చెందిన దంపతులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని శిశు గృహం నుంచి 13 నెలల చిన్నారి జస్మితను తమిళనాడుకు చెందిన దంపతులు తొలిసారి చట్టపరంగా దత్తత తీసుకున్నారు. వీరిని జిల్లా కలెక్టర్ శ్రీధర్ అభినందించారు. రాయచోటిలో ని శిశు గృహంలో పెరుగుతున్న 13 నెలల చిన్నారి జస్మితను తమిళనాడుకు చెందిన దంపతులు రంగనాథన్, శరణ్యలకు గురువారం కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ సమక్షంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, ఆ శాఖ సిబ్బంది అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూచట్టపరమైన ఇటువంటి దత్తతలను ప్రోత్సహించాలన్నారు. మాతృత్వం ఒక వరం.. దత్తత అందుకు మరో మార్గం అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన దంపతులు కేరింగ్స్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకున్నారని, దత్తత తీసుకోవాలి అనుకునే దంపతులు ఈ పోర్టల్ ద్వారా రిజర్వ్ చేసుకుంటే చట్టపరంగా ఇబ్బందులు లేకుండా దత్తత సులువుగా తీసుకోవచ్చని తెలిపారు.

మార్చి 8న లోక్ అదాలత్

కడప అర్బన్: మార్చి 8న జాతీయలోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి కె. ప్రత్యూషకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 08562– 258622 ఫోన్ నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సారారహిత జిల్లాగా మారుద్దాం



అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి: అన్నమయ్య జిల్లాను నాటుసారా రహితంగా మారుద్దామని, ఇందుకోసం సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. నాటుసారా అమ్మడం, తయారు చేయడం, రవాణ చేయడం చట్టరీత్యా నేరమని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 19 మండలాలలో నాటుసారా తయారు చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. ఈ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి నాటుసారా రహితంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. అంతకుముందుగా నవోదయ 2.0 కార్యక్రమ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరిటెండెంట్ జి మధుసూదన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎక్సైజ్ శాఖ సహాయ సూపరిటెండెంట్ వై జోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు జానమద్ది వర్ధంతి

కడప కల్చరల్: సీపీ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాత, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 11వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించనున్నారు. కడపలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిసున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఈ సందర్భంగా రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ఆచార్య పి.ఆర్. హరినాథ్ (మైసూరు) 'తెలుగు పద్య వైభవం – శబ్ద సౌందర్యం' అనే అంశంపై స్మారకోపన్యాసం చేస్తారన్నారు. ముఖ్య అతిథిగా వైవీయూ వీసీ ఫణితి ప్రకాష్ బాబు హాజరవుతారని తెలిపారు.

పుష్ప విలాపం

కలెక్టర్ దొర.. మా ప్రాణాలు పోతున్నాయి.. కాస్తా నీరు పోసి.. ప్రాణాలు కాపాడండి..

- ప్రతి రోజు మీకు.. మీ కార్యాలయ అధికారులు.. సిబ్బందికి.. సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చి వెళ్లే ప్రజలకు రంగు రంగుల తోరణాలతో స్వాగతాలు పలుకుతుంటాం..
- మా మధ్యన ఉన్న పంపు సెట్టు నుంచి వృథాగా పోతున్న నీటిని అందించినా చాలు..
- అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఆవరణలో వాడి ఎండుతున్న పూల మొక్కల మూగరోదన.

కలెక్టరేట్ ఆవరణలో ఎండుతున్న పూల మొక్కల ఆవేదన



నీరు లేక ఎండు దశకు చేరుకున్న పూలమొక్కలు



కలెక్టర్ కార్యాలయానికి నీటిని అందించే పంపుసెట్టు వద్ద వృథాగా పోతున్న నీరు

రాయచోటి: కలెక్టర్ దొర మాకు నీళ్లు పోసి మా ప్రాణాలను కాపాడండి అంటూ కలెక్టర్ కార్యాలయంలో పరిధిలో ఉన్న పూలమొక్కలు, రకరకాల మొక్కలు ప్రాధేయపడుతున్నాయి. భగభగ మండుతున్న ఎండలకు నీరు అందకపోవడంతో మలమల వాడిపోయి ప్రాణాలు పోయే పరిస్థితి దాపురిస్తోందంటూ మూగగా రోదిస్తున్నాయి. జిల్లాలో ప్రజలు, పశువులకు నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరిస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ దొర గారు.. ప్రతి రోజు మీరు వచ్చి పోయే సమయంలో మాలో దాగి ఉన్న కష్టాలను పంటి బిగువున (వేర్ల మధ్యన) దిగ మింగుకొని చిరునవ్వులతో మీకు స్వాగతాలు పలుకుతున్నాము. మీకు కనిపించే అందమైన పుష్పాల చెట్ల మొదళ్లల్లో కొన్ని నెలలుగా నీరు లేక కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాం.. కాస్త దయతలచండి దొర గారూ..

- కలెక్టర్‌సారు కార్యాలయ పరిధిలో నీరు లేక మేము ఎండిపోలేదు.. కార్యాలయానికి అవసరమైన నీటిని అందిస్తున్న బోరుబావి మా మధ్యనే (పూల మొక్కల వరుస దారిలో) ఉంది. కార్యాలయానికి అవసరమైన నీటిని అందించే పంపు సెట్టు నుంచి లీటర్ల కొలదీ నీరు వృథాగా బయటకు చిమ్ముతుంటుంది. అలాగే మన కార్యాలయం పైన ఉన్న నీటిసంపులు నిండిపోయి గంటల కొలదీ పైపుల ద్వారా బయటకు దూకుతుంటాయి. ఇలా వృథా అవుతున్న నీటిని డ్రిప్ పైపుల ద్వారా మాకందించిన మరింత ఏపుగా పెరిగి మీకు, కార్యాలయ అధికారులు, సిబ్బందికి, వివిధ పనులు, సమస్యల పరిష్కారం కోసం వచ్చి వెళ్లే ప్రజలకు చల్లటి వాతావరణాన్ని అందిస్తాం.. మమ్ములను పర్యవేక్షించే అధికారులు మా బాధను పట్టించుకునేలా కాస్త ఆదేశాలు ఇవ్వండి కలెక్టర్ దొర గారు.. వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.. దొరా పర్యవేక్షకులపై మేము ఇచ్చే ఫిర్యాదు కానే కాదు.. రోజు రోజుకు పెరుగుతున్న వేడిని భరించలేక.. ఆకలిని తాళలేక.. మరొకరికి చెప్పుకోలేక.. మీకు మాత్రమే చేసుకుంటున్న చిన్న విన్నపం మాత్రమే..

పరీక్షల వేళ.. నిర్లక్ష్యం ఏల!

- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- సమతుల ఆహారం తీసుకోవాలి
- నిపుణుల సూచన




చదువులో నిమగ్నమైన విద్యార్థులు

రాజంపేట టౌన్: టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానుండగా, టెన్త్ పబ్లిక్ పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి జరగనున్నాయి. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు క్షణం తీరికలేకుండా చదువే లోకం అన్న విధంగా చదువుతుంటారు. వేళకు ఆహారం కూడా తీసుకోకుండా చదివే విద్యార్థులు కూడా లేకపోలేదు. అయితే వేళకు ఆహారం తీసుకోకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యు లు చెబుతున్నారు. పరీక్షల సమయంలో చదవడం ఎంత ప్రధానమో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంతకంటే ముఖ్యమని వారు అంటున్నారు. పరీక్షల సమయంలో చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా ఆ ప్రభావం మార్కులపై పడుతుంది. అంతేకాక ఒక్కోమారు పరీక్షకు కూడా వెళ్లలేని పరిస్థితులు ఉండవచ్చు. అందువల్ల విద్యార్థులు పరీక్షలు ముగిసే వరకు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వేళకు ఆహా రం తీసుకోవడంతో పాటు కొన్ని రకాల ఆహార పదార్థాలకు దూరంగా ఉంటూ కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


ఆహార నియమాలు

- తేలికగా జీర్ణం అయ్యే ఇడ్లీ, రసంతో భోజనం తీసుకోవడం ఉత్తమం.
- జామ, ఆపిల్ వంటి పండ్లను తినడంవల్ల జీర్ణ వ్యవస్థ బాగా పనిచేసి ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటారు.
- మెదడు చురుకుగా పనిచేయడానికి ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.
- ప్రస్తుతం ఎండలు ఎక్కువైనందున మాంసాహారాలకు, మసాలతో చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.
- కారం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోకూడదు. నూనెతో చేసే ఆహార పదార్థాలు కూడా తక్కువగా తినాలి.
- జింక్‌ఫుడ్ పూర్తిగా మానేయాలి. జింక్‌ఫుడ్ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.
- రాత్రి వేళ నిద్రమేల్కొనేందుకు కాఫీ, టీలను ఎక్కువగా తీసుకోకూడదు.
- రాత్రి పొద్దుపోయేంత వరకు చదవ కూడదు.
- కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలి.
- వేకువ జామున చదవే పాఠ్యాంశాలు బాగా గుర్తుంటాయి.
- చదివేటప్పుడు ఒత్తిడికి గురైతే కడుపులో మంట వస్తుంది. అటువంటప్పుడు ప్రతిరోజూ రాత్రిపూట పెరుగన్నం తింటే మంచిది.
- పచ్చిక్యారెట్‌ను తగిన మోతాదులో తినడంవల్ల విటమిన్–ఏ లభిస్తుంది. పుస్తకాలు చదివే సమయంలో కళ్లు మంటలు పుడుతుంటాయి. దీనినుంచి బయట పడాలంటే క్యారెట్ తీసుకోవాలి.

జిల్లాలో పది పరీక్షలు రాయనున్న విద్యార్థులు:	ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు:	ద్వితీయ సంవత్సరం విద్యార్థులు:
22,335	14,855	13,747



ద్రవపదార్థాలు తీసుకోవాలి



విద్యార్థులకు పరీక్షల సమయం ఎంతో కీలకమైనది. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువైనందున శరీరం డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవడం చాలా అవసరం. రోజుకు కనీసం మూడు లీటర్ల నీటిని తాగాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ తాగితే శరీరానికి ఎంతో మేలుచేస్తుంది. పరీక్షలు ముగిసేవరకు మాంసాహారం మానేసి ఆకుకూరలను తీసుకుంటే ఆరోగ్య సమస్యలు దరిచేరవు.
– డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరిండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట

ధ్యానం తప్పనిసరి



పరీక్షలకు సమయం దగ్గరపడే కొద్ది విద్యార్థులు ఒత్తిడికి లోనవుతుంటారు. అందువల్ల వేకువ జామున కనీసం అరగంట సమయం కేటాయించుకొని కొన్ని యోగాసనాలు, ధ్యానం చేస్తే ఒత్తిడిని అధికమించవచ్చు. ధ్యానం, యోగా చేయడం వల్ల మెదడు చురుకుగా కూడా పనిచేస్తుంది. దీని వల్ల చదివిన విషయాలు బాగా గుర్తుండిపోతాయి. – డాక్టర్ శివపురం చంద్రమోహన్, యోగా శిక్షకుడు, రాజంపేట

క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు


నిందితుడు శ్రీకాంత్ (ఫైల్)

ములకలచెరువు : ములకలచెరువు పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బురకాయలకోటకు చెందిన కె. శ్రీకాంత్(27) ఒక మైనర్ బాలికను తన ఆటోలో కిడ్నాప్ చేసి అదృశ్యం చేశాడు. దీనిపై అదే గ్రామానికి చెందిన బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. నిందితుడు, బాలిక ఆచూకీ కోసం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు చోరీ

నిమ్మనపల్లె : మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ముష్టూరు పంచాయతీ వలసపల్లెకు చెందిన నారాయణరెడ్డి భార్య ఎల్.ఓబులమ్మ (65) మదనపల్లె రోడ్డులోని మర్రిబండ బస్ స్టాప్ వద్ద ఉండగా, గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్ పై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బంగారు గొలుసు బరువు సుమారు 25 గ్రాములు ఉంటుందని దాదాపు రూ.2 లక్షలు విలువ అవుతుంది బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూచిపల్లి సమీపంలో గురువారం కోడి పందేల జూదం అధికంగా సాగుతోందని పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఎస్ఐ నరసింహుడు సిబ్బందితో కలిసి కోడి పందేల స్థావరంపై దాడులు నిర్వహించారు. ఆరుగురు జూదరులు, ఐదు కోడి పుంజులు పట్టుబడగా జూదరుల వద్ద లభించిన రూ.3,150ల నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఏఎస్ఐ గోపాల్ నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


చెట్టును ఢీ కొన్న కారు

వీరబల్లి : మండలంలోని సోమవరం పంచాయ కమ్మపల్లికి చెందిన కాకర్ల అభిషేక్ అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వివరాలిలా.. కాకర్ల అభిషేక్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. శివరాత్రి సందర్భంగా తన సొంత ఊరికి కారులో బయలుదేరాడు. గురువారం తెల్లవారుజామున స్వగ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉండగా నీలావాండ్లపల్లి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టాడు. అభిషేక్ గాయపడిన విషయం తెలుసుకున్న బంధువులు వెంటనే తిరుపతి ఆసుపత్రికి తరలించారు.

ఇంటి స్థలం వివాదంలో దాడి


శంకరయ్య నాయుడు తలకు తగిలిన గాయం

ఓబులవారిపల్లె : మంగంపల్లి గ్రామంలో ఇంటిస్థలం గొడవ కారణంగా గురువారం మద్దిన శంకరయ్య నాయుడు అనే వ్యక్తి తలకు తీవ్ర గాయమైంది. ఇంటి స్థలం విషయమై ఇటీవలే పెద్దమనుషులు మాచిన శివయ్య నాయుడుకు, శంకరయ్యలకు మధ్య సయోధ్య కుదిర్చారు. అయితే తిరిగి ఇరువురు గొడవ పడటంతో శంకరయ్య నాయుడు తలపై శివయ్య నాయుడు రాయితో కొట్టడంతో గాయమైంది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శంకరయ్య నాయుడు ఫిర్యాదు చేశాడు. గాయపడిన వ్యక్తిని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అధికారం అండతో.. బరితెగింపు


టీడీపీ నాయకుడు చలపతి ఆక్రమణను జేసీబీతో తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు


ఎవరో చేసిన తప్పునకు తమను శిక్షించడంపై ప్రశ్నించిన దుకాణదారురాలిని లాక్కెళుతున్న పోలీసులు

- రెవెన్యూ అధికారులపై దాడి చేసింది టీడీపీ నాయకుడే
- ఆర్ఐపై దాడితో సీరియస్ అయిన రెవెన్యూ యంత్రాంగం
- రూ.2 కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినట్లు గుర్తింపు
- జేసీబీలతో ఆక్రమణలు నేలమట్టం

మదనపల్లె : రెడ్‌బుక్ రాజ్యాంగం అండతో టీడీపీ గూండాలు దాడులకు తెగబడుతున్నారు. అధికారంలో ఉన్నది తామేనన్న అహంతో కళ్లు కనిపించక ఏకంగా రెవెన్యూ అధికారులపైనే దాడులకు పాల్పడుతున్నారు. ఆక్రమణలకు అడ్డువచ్చిన అధికారులను మారణాయుధాలతో హత్యచేసేందుకు వెనుకాడటం లేదు. రెండురోజుల క్రితం మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్... సర్వే నంబర్.1029లో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై మారణాయుధాలతో దాడికి పాల్పడి, జేసీబీకి నిప్పుపెట్టి బెదిరింపులకు పాల్పడిన భూకబ్జాదారుడు టీడీపీ నాయకుడేనని తెలిసింది. టీడీపీలోని ప్రధాన నాయకుల అండదండలతో మదనపల్లె పట్టణం, మండలంలో సుమారు రూ.2కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ స్థలాలను తప్పుడు పత్రాలతో ఆక్రమించుకోవడమే కాకుండా, వాటిని యథేచ్ఛగా ఇతరులకు లీజు అగ్రిమెంట్‌పై విక్రయించినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరింత జోరు పెంచినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే దేవతానగర్‌లోని ప్రభుత్వ గయాలు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడం, అడ్డువచ్చిన రెవెన్యూ అధికారులపై దాడికి పాల్పడటం జరిగింది. రెవెన్యూ అధికారులపై భూకబ్జాదారుడి దాడి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఈ విషయంపై సీరియస్ అయ్యారు. దాడికి పాల్పడిన నిందితుడు చలపతి ఆక్రమణలు ఎక్కడెక్కడ ఉన్నాయో నిగ్గుతేల్చాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో వారు ఆగమేఘాలపై...దేవతానగర్ సర్వేనెం.1029లోని ప్రభుత్వ గయాలు స్థలం, బీకే.పల్లె సర్వే నెంబర్.516/1లో 6 సెంట్ల స్థలంలో రెండు పునాదులు, రెండు షాపురూములు, కోమటివానిచెరువు సమీపంలోని ఎస్‌బీఐ కాలనీలో ఇంటిస్థలం, సీటీఎం క్రాస్‌రోడ్డులో ఇంటిస్థలం ఆక్రమించినట్లు నిర్ధారించారు. దీంతో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఆక్రమణలను తొలగించడంతో పాటుగా, అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేయాల్సిందిగా ఆదేశించారు. బుధవారం రాత్రి వరకు పట్టణంలోని ఆక్రమణలు తొలగించిన రెవెన్యూ అధికారులు, గురువారం ఉదయం సీటీఎం క్రాస్‌లోని అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు ప్రయత్నించారు. అయితే..ఆ స్థలంలో భైరవేశ్వర ఎలక్ట్రికల్స్, హార్డ్‌వేర్స్ పేరుతో దుకాణం ఉండటంతో ఖాళీ చేయాల్సిందిగా అధికారులు కోరారు. దుకాణదారుడు...తాను రూ.10లక్షలకు చలపతి నుంచి స్థలాన్ని కొనుగోలు చేశానని, 20లక్షలకు పైగా ఖర్చుచేసి దుకాణాన్ని నిర్మించుకున్నానన్నారు. రెవెన్యూ అధికారులు ఉన్న ఫళంగా దుకాణాన్ని కూల్చేస్తే తన పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశాడు. జేసీబీకి అడ్డుగా కుటుంబ సభ్యులతో బైఠాయించాడు. ప్రభుత్వ స్థలాన్ని కొనుగోలు చేయడం నేరం కిందకే వస్తుందని, పై అధికారుల ఆదేశాలు తాము తప్పక పాటించాల్సిందేనని, పోలీసుల సహాయంతో ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నారు. భవనాన్ని నేలమట్టం చేశారు. అయితే... అక్కడ గుమికూడిన ప్రజలు, గ్రామస్తులు..రెవెన్యూ అధికారిపై దాడిచేశాడని ఆక్రమణల తొలగింపుకు హడావిడి చేస్తున్నారే కానీ, ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నప్పుడు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు, భూకబ్జాదారుడైన టీడీపీ నాయకుడు చలపతికి మధ్య జరిగిన పోరులో అమాయకుడు తన కష్టార్జితాన్ని 30 లక్షలకు పైగా నష్టపోయి, రోడ్డున పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణ తొలగింపులో తాలూకా సీఐ కళా వెంకటరమణ, సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వోలు, పోలీసులు పాల్గొన్నారు.

పెన్నా నదిలో పడి యువకుడి మృతి


పెన్నానదిలో మృతి చెందిన యువకుడు షరీఫ్

సిద్దవటం : సిద్దవటం మండలం జ్యోతి గ్రామ సమీపంలోని పెన్నానదిలో కడపకు చెందిన ఎస్. షరీఫ్ (17) మృతి చెందినట్లు సిద్దవటం పోలీసులు తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా కడపకు చెందిన చాంద్‌బాషా కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్. షరీఫ్(17) తన స్నేహితులతో కలిసి బుధవారం నిత్యపూజస్వామి కోనకు వచ్చాడు. మధ్యాహ్నం జ్యోతి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన అన్నదానం వద్ద భోజనం చేశాడు. జ్యోతి గ్రామం నుంచి మాచుపల్లె మీదుగా స్నేహితులతో కలిసి పెన్నానది నీటిలో నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి షరీఫ్ మునిగిపోయాడు. అతని స్నేహితులు కడపకు వెళ్లి పెన్నా నీటిలో షరీఫ్ మునిగిపోయిన విషయాన్ని అతని ఇంట్లో చెప్పారు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులు యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టినా కనిపించలేదు. గురువారం యువకుడు షరీఫ్ మృతదేహం పెన్నానదిలో లభ్యమైంది. ఈ మేరకు సిద్దవటం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గంగాప్రసాద్

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు గాయపడిన సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. ఏర్పేడు మండలానికి చెందిన గంగాప్రసాద్‌యాదవ్(35), చిన్నమండ్యం మండలం తుమ్మలగొందికి చెందిన శంకర్‌రెడ్డి(35)లు లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ బుధవారం రాత్రి ఏర్పేడులోని సివిల్ సప్లయ్స్ గోడౌన్ నుంచి మదనపల్లెకు రెండు లారీల్లో బియ్యం తీసుకువచ్చారు. లారీలను నీరుగట్టువారిపల్లెలోని టమాటా మార్కెట్‌యర్డులో సివిల్ సప్లయ్ గోడౌన్‌వద్ద పార్కు చేశారు. గురువారం ఉదయం టిఫిన్ తినడం కోసం ద్విచక్ర వాహనంలోఇద్దరు మదనపల్లెకు వచ్చారు. టిఫిన్ తిని తిరిగి లారీల వద్దకు వెళుతుండగా కదిరిరోడ్డులో ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్లు ఇద్దరు గాయపడ్డారు. వీరిని స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యపూజ స్వామికి రూ.10 లక్షల ఆదాయం


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సిద్దవటం : శ్రీ నిత్యపూజ స్వామికి మహాశివరాత్రి ఉత్సవాల్లో రూ. 10 లక్షల 26 వేల 926 ఆదాయం వచ్చిందని నిత్యపూజ కోన మహా శివరాత్రి ఉత్సవాల ప్రత్యేక అధికారి సి.శివయ్య, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శ్రీ నిత్యపూజ కోన ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారన్నారు.

అలాగే వెండి ఒక కేజీ 324 గ్రాములు, బంగారం రెండు గ్రాముల 650 మిల్లి గ్రాములు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ పి.సురేష్ కుమార్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి మోహన్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది సిద్దవటం, కడప పోలీసులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు పెట్టిన ఆకతాయిలు


మంటలు అదుపు చేస్తున్న కోన హెచ్‌పీసీఎల్ అధికారులు, సిబ్బంది

కలకడ : పవిత్ర ఝరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తుల్లో కొందరు ఆకతాయిలు ఎండిన గడ్డికి నిప్పంటించారు. దీంతో దాదాపు ఐదు ఎకరాల మేర అడవిలోని చెట్లకు నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న కలకడ సీఐ గురునాథ, ఎస్ఐ రామాంజనేయులు వెంటనే కలకడ మండలం కోన వద్దగల హెచ్‌పీసీఎల్ అధికారులకు సమాచారం అందించారు. హెచ్‌పీసీఎల్ అధికారి శ్రీనివాసరావ్ ఆదేశాలమేరకు అధికారులు సాయిమనీష్, మితిలేష్‌కుమార్, ఇస్మాయిల్, సిబ్బంది లక్ష్మీకాంత్, ఫకృద్దీన్, ఉపేంద్ర, ఫైరోజ్, సాయి తదితరులు మంటలు అదుపు చేశారు. మంటలు అన్నదాన సత్రంలోకి ప్రవేశించి ఉంటే పెనుప్రమాదం జరిగేది.

తప్పిపోయిన ముగ్గురు చిన్నారుల అప్పగింత

కడప, మదనపల్లె, కలకడ మండలంలోని చిన్నారులు ముగ్గురు పవిత్ర ఝరిలో తప్పి పోగా పోలీస్ కంట్రోల్ రూమ్ పోలీసులు మైకు ద్వారా ప్రచారం చేశారు. సాయంత్రం వరకు వేచి చూసి ఎట్టకేలకు వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

బ్యాటరీల చోరీ కేసులో నాలుగు నెలలు జైలు


చోరీ కేసులో నిందితుడు

రాయచోటి టౌన్ : సెల్ టవర్ వద్ద మూడు బ్యాటరీలు చోరీ చేసిన కేసులో ముద్దాయికి నాలుగు నెలల జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించినట్లు అర్బన్ ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. గత ఏడాది ఆగస్టు 9వ తేదీ రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామ సమీపంలో ఎయిర్‌టెల్ టవర్ వద్ద టవర్ కోసం ఏర్పాటు చేసిన రూ.24 వేలు విలువ గల మూడు బ్యాటరీలు చోరీకి గురయ్యాయన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి రాయచోటి పట్టణంలోని రాయుడు కాలనీకి చెందిన పెదివీటి దావీదుగా గుర్తించి కేసు నమోదు చేశారన్నారు. దీనిపై విచారణ చేసిన రాయచోటి ఇన్‌చార్జి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పీజే తేజ సాయి ముద్దాయికి ఈ మేరకు శిక్ష విధించారని తెలిపారు. ఈ కేసు విచారణలో పోలీసులు రమేష్, నాగ శంకర్‌లు విశేషమైన కృషి చేశారన్నారు.

రూ.4.50 కోట్లకు ఐపీ బాంబ్

రాజంపేట రూరల్ : రాజంపేట పట్టణంలో అందరికీ సుపరిచితుడైన వ్యక్తి కోట్ల రూపాయలు దండుకొని మరో ఐపీ బాంబ్ పేల్చాడు. మెయిన్ బజార్‌లో కొన్ని సంవత్సరాలుగా షాప్ పెట్టుకొని వ్యాపారం చేస్తున్న ఈ అప్పుల అప్పారావు గురువారం కనిపించకుండా జంప్ కావడంతో అప్పులిచ్చిన వారు లబోదిబో మంటున్నారు. ఇతను చీటీల పేరుతో కొందరిని బురిడీ కొట్టించి నగదు తీసుకున్నాడు. అధిక వడ్డీలతో మరికొందరిని మభ్య పెట్టి అప్పుగా తీసుకున్నాడు. దాదాపు రూ.4.50 కోట్లకు పైగా అప్పులు చేసి చేతులెత్తేశాడు. పెద్దలకు తెలియకుండా అప్పులిచ్చిన వారు కొందరైతే, ఇంటిలో భర్తకు తెలియకుండా భార్య, భార్యకు తెలియకుండా భర్త అప్పులిచ్చిన వారు సగం మంది ఉన్నారు. లక్షలలో అప్పులిచ్చిన వారు ఐటీ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ముందుకు రావటం లేదు. ఈ అప్పుల అప్పారావు వలన కొన్ని కుంటుంబాలు వీధిన పడేటట్టు ఉన్నాయి.

పొదుపుతోనే ఆర్థిక సాధికారత


పోస్టర్ ఆవిష్కరణలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి : ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకొని సాధికారత సాధించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ ఆర్థిక పొదుపు వారోత్సవాలు–2025 ప్రచార పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం ఒక్కో అంశంతో ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రజల్లో అవగాహన కలిగే విధంగా ఆర్థిక వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్ రావు, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, సహాయ మేనేజర్ మన్సూరు బాషా పాల్గొన్నారు.

కనుల పండువగా కామాక్షి త్రేతేశ్వరుని కల్యాణం


ప్రత్యేక ఆసనంపై కొలువుదీరిన శ్రీకామాక్షిదేవి సమేత త్రేతేశ్వరస్వామి

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజు గురువారం శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. దేవదాయశాఖ, ఉభయదారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో కామాక్షి దేవి, త్రేతేశ్వరస్వామిని పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక ఆసనంపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలతో ఆలయ ప్రధాన అర్చకులు కె. పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు గణేష్, శశిధర్ స్వాములు వేద మంత్రాలు వల్లిస్తూ కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కల్యాణం సమయంలో శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులకు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. ఈ కల్యాణ వేడుకలలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

వాలీశ్వరకొండపై కర్ణాటక భక్తురాలి మృతి


బల్లసముద్రం కొండపై మృతి చెందిన కర్ణాటక భక్తురాలు వెంకటమ్మ

రామసముద్రం : మండలంలోని బల్లసముద్రం కొండపై వాలీశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తురాలు మార్గమధ్యంలో కుప్పకూలి ప్రాణాలు విడిచింది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు... కర్ణాటక గుండ్లపురానికి చెందిన భక్తురాలు వెంకటమ్మ(75) గురువారం కాలినడకన కొండపైకి ఎక్కుతోంది. అయితే మార్గమధ్యంలో ఉన్నట్లుండి కుప్పకూలి పడిపోయి అక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వివరాలు సేకరించారు. కర్ణాటకలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కర్ణాటక భక్తురాలు ఎండ వేడికి తట్టుకోలేక మరణించిందా..? లేక గుండెపోటుతో మృతి చెందిందా అన్నది తెలియలేదని ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

టీడీపీ కూటమి నియంతృత్వ పాలనతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. రాజ్యాంగా హక్కులను కాలరాస్తోంది. పౌరుల ప్రాథమిక హక్కులను అణచివేస్తోంది. తాజాగా ప్రముఖ సినీనటుడు పోసాని కృష్ణమురళిని హైదరాబాద్‌లో అక్రమంగా అరెస్టు చేయడం టీడీపీ కూటమి ప్రభుత్వ కక్షసాధింపునకు నిదర్శనం.అక్రమ అరెస్టును పలువురు నాయకులు ఖండించారు.

–సాక్షి నెట్‌వర్క్

చంద్రబాబుది నియంత పాలన



రాష్ట్రంలో అరాచకం పెరిగిపోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నియంత పాలన సాగిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులు ఎవరైనా వారిపై కక్షసాధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వీరి వేధింపులకు కళాకారులు, రాజకీయ విశ్లేషకులు బలవుతున్నారు.నటుడు, దర్శకుడు, రచయిత పోసాని కృష్ణమురళి అరెస్టు చంద్రబాబు కక్ష రాజకీయాలకు పరాకాష్టగా నిలుస్తోంది. పోసాని కొన్ని నెలల క్రితం తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు బహిరంగంగా ప్రకటించినా ఆయన్ను వేధించడం సరికాదు. చట్టవ్యతిరేక అరెస్టులపై వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుంది.

– పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్యే, తంబళ్లపల్లె

కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట



పోసాని కృష్ణమురళిని అరెస్టు కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అక్రమ అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇటువంటి అక్రమ అరెస్టులు చేయటం దారుణమైన చర్య. చంద్రబాబు ఒక నియంతలా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో కక్ష రాజకీయాలు మంచివి కావు.

– ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

పోసాని అరెస్ట్ అప్రజాస్వామికం



రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోంది. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కక్షసాధింపు చర్యలకు దిగుతూనే ఉంది.కూటమిప్రభుత్వం 9 నెలల పాలనలో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై అక్రమ కేసులు పెడుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఎండగడుతున్నందుకు, డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా పోసానిని అరెస్ట్ చేశారు. ప్రశ్నించే ప్రతి గొంతును నొక్కాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. సీఎం చంద్రబాబు నియంతలా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను ప్రజలు హర్షించరు.

- నిసార్‌అహ్మద్, మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త

రాష్ట్రంలో ప్రజలకు వాక్ స్వాతంత్య్రమే లేకుండా పోయింది



పోసాని కృష్ణ మురళిని పోలీసులు అరెస్ట్ చేయడం దుర్మార్గం. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనకు పోసాని అరెస్ట్ అద్దం పడుతోంది. అనంతపురం నుంచి వచ్చామని అబద్ధాలు చెప్పి ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, అరెస్టు విషయంలో సైతం తప్పుదోవ పట్టించారు.ఆ పోలీసులు అన్నమయ్య జిల్లా సంబేపల్లికి చెందిన వారని, నోటీసులో పేర్కొన్న సెక్షన్లకు.. ఆయనకు ఎలాంటి సంబంధం లేదు.పోసాని క్రిష్ణ మురళి టీవీ డిబేట్లలో న్యాయపరంగా, చట్టపరంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తారు. అలాంటి వ్యక్తిని అరెస్ట్ చేయడం బాధాకరం.విమర్శలను కూటమి ప్రభుత్వం తట్టుకోలేకపోతోంది. ప్రజలకు ఉన్న వాక్ స్వాతంత్ర్యాన్ని కూడా హరిస్తూ మాట్లాడాలంటేనే భయపడే పరిస్థితికి తీసుకొచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజల రక్షణకు ఉపయోగించాల్సిన పోలీసులను రాజకీయ కక్షసాధింపులకు వాడుకోవడం దారుణం.

- అంజద్‌బాషా, మాజీ డిప్యూటీ సీఎం

రేపటి నుంచి అనంతపురం గంగమ్మ జాతర


భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు, చలువ పందిళ్లు

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలెన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మిఠాయి బండ్లు, చెరకుల బండ్లు ఇక్కడికి చేరుకున్నాయి. గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, పూజారులు చెల్లు గంగరాజు, మదన్ మోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. లక్కిరెడ్డిపల్లె సీఐ వెంకటకొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు బృందితో కలిసి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. అర్చకులు చెల్లు వంశీకులైన చెల్లు గంగరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఎవరికైనా అమ్మే!



ప్రేమకు మనుషులే కాదు.. జంతువులు కూడా అతీతం కాదు. అందులోనూ తల్లిప్రేమ. ఈ సృష్టిలో అత్యంత తీయనైనది. పోల్చలేనిది. వర్ణించలేనిది అంటూ ఏదైనా ఉందంటే అది తల్లి ప్రేమే. మనుషులే కాదు.. జంతువులు కూడా తమ తల్లి ప్రేమను చాటడం.. అందులోని మాధుర్యాన్ని పంచడం చూస్తూనే ఉంటాం. అది కేవలం సంతోష సమయంలోనే కాదు.. కష్టకాలంలోనూ ఆ అమ్మప్రేమ బహిర్గతమవుతుంది. అదే తరహాలో ఓ శునకం తల్లి ప్రేమన చాటుకున్న సంఘటన రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్ ఎదుట కనిపించింది. సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేశారంటూ విచారణ నిమిత్తం సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు పోసాని మురళీ కృష్ణను పోలీసులు హైదరాబాద్ నుంచి ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసు స్టేషన్‌లోకి ఎవరూ రాకుండా పోలీసులు గేటు మూసి వేశారు. ఈ సమయంలో తల్లి కుక్క గేటు బయట ఉండిపోగా.. పిల్ల మాత్రం గేటు లోపల ఉండిపోయింది. దీంతో దిక్కు తోచని తల్లి కుక్క తన బిడ్డ కోసం గేటు బయట అలాగే నిరీక్షిస్తూ ఉండగా.. గేటు లోపలి నుంచి ఆ చిన్న శునకం తల్లివైపు అలాగే చూస్తూ నిలబడి పోయింది. సుమారు 3 గంటల తర్వాత గేటు తెరవడంతో తల్లీబిడ్డలు కలిసి పరుగులు తీశాయి. ఈ దృశ్యాన్ని చూసిన వారు తల్లి ప్రేమ ఎంత గొప్పదో కదా.. అమ్మ ఎవరికైనా అమ్మే కదా అంటూ చర్చించుకోవడం విశేషం.

– ఫొటో, ఎస్.కె. మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటో గ్రాఫర్, కడప